కథా నిలయం
శ్రీకాకుళం

# కథా - కమామీషు

నా సాహితీ వ్యాసంగం కొంతవరకు సంతృప్తిగానే కొనసాగుతున్నది. కథలు చాలానే వ్రాశాను. కొన్ని ప్రచురింపబడినై, మరికొన్ని తిరస్కరింపబడినై. అతికొద్ది కథలకు బహుమతులందుకుని ప్రోత్సహింపబడ్డాను కూడా.నా, ఈ రచనా వ్యాపకానికి మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం చాలా గుర్తుంచుకోవలసిన అవసరం నాకున్నది.

నేను ఓ కథ వ్రాయగానే మా అమ్మ, నాన్న, శ్రీమతి, మా పెద్దబ్బాయి శ్రీనివాస్, పెద్ద కూతురు లక్ష్మి చిన్న కూతురు కల్యాణి పోటీలుపడి మరీ చదువుతారు. చదివి వారి వారి అభిప్రాయాలను నిష్కర్షగా చెప్పేస్తారు. సూచనలూ ఇస్తారు. ఎటొచ్చీ మా ఆఖరివాడు ఆరేళ్ల వరుణ్ మాత్రం ఇంకా నా కథలు చదివేదాకా రాలేదు. అంటే నేను వ్రాసిన కథ ఏ పత్రికలోనూ ప్రచురింపబడకపోయినా ఆరుగురు పాఠకులు మాత్రం నాకున్నారు.

అందుకే కాబోలు ఇటీవల కొద్దికాలం నుంచీ నాకో గమ్మత్తయిన కోరిక కలుగుతోంది. అదేంటో కాదు ఓ ఆదివారం రోజు మా ఇంట్లో ఆరుగుర్ని తలా ఓ కథ వ్రాయించాలనీ, ఆ కథలకు న్యాయ నిర్ణేతగా నేను వ్యవహరించాలనీ.

అసలా కోరికలో నా అంతరార్థం ఏమిటంటే ఆ ఆరుగురిలో ఎవరెవరు ఏ ఏ విషయాన్ని వారి కథా వస్తువుగా ఎన్నుకుంటారో తెలుసుకోవాలన్న ఆరాటమే అధిక ప్రాధాన్యత వహిస్తుంది. ఎవరు ఎలా వ్రాశారు అనే విషయానికి ఏమాత్రం ప్రాముఖ్యత లేదు నా దృష్టిలో.

ఓ శనివారం రాత్రి పలహారం చేస్తూ నా మనసులోని కోరికను అందరి ముందూ పెట్టేను. ముందుగా అందరూ ఆశ్చర్యపోయారు. "నావల్ల కాదంటూ" మెలికలు తిరిగింది నాభార్య. "నేనేం వ్రాస్తాను వానాకాలం

చదువూ నేనూ." అంటూ మొండికేసింది అమ్మ. "పెద్దపెద్ద వాళ్ల సాహిత్యం ఇంకా ఎక్కువగా చదివి కథలింకా బాగా వ్రాసేటందుకు ప్రయత్నించు. మాచేత కథలేం వ్రాయిస్తావుగాని" మందలింపుగా అన్నాడు నాన్న.

"నేనో మాంఛి కథ వ్రాస్తాను... అయితే నవ్వకూడదు." షరతు పెట్టేడు శ్రీనివాస్.

"నేనూ వ్రాస్తాను. కానీ అది నువ్వొక్కడివి తప్ప ఇంకెవ్వరికీ చూపనంటేనే..." తనూ ఓ మెలిక పెట్టంది లక్ష్మి.

"నే వ్రాస్తాను... మీ కథలో ఓ కథ చూసి" అని నవ్వింది శ్రీమతి.

"నాన్నా...నాన్నా...నేనూ రాత్తాను. కావాలంటే దాన్ని అందరు చూస్కోండి.. సరేనా..." అంటూ ఉత్సాహపడ్డాడు వరుణ్.

"వెరీగుడ్... అలా వుండాలి అందరూ... నువ్వు ఫస్ట్ మొదలుపెట్టరా" అంటూ ఆఖరివాడి వీపు తట్టేను.

"కాఫీ కథలు కాదు. నీకు వ్రాయటం ఎలా వచ్చో చూద్దాం అనికాదు వూర్కే సరదాగా అలా... అంతే... కావాలంటే 'కాఫీ' కథ వ్రాసుకో కాదనను. కానీ నువ్వూ ఓ కథ వ్రాయాల్సిందే" శ్రీమతిని ఉద్దేశించి చెప్పేను.

"సరదాగా వ్రాయమ్మా చూద్దాం." వాళ్ల అమ్మను బ్రతిమాలింది పెద్ద కూతురు.

మౌనం అర్ధాంగీకారంగా చెప్పిందామె.

"అమ్మా, నువ్వూ నాన్న కూడా వ్రాయాల్సిందే." అన్నాను టిఫిన్ ప్లేటులో చేయి కడుక్కుంటూ.

"రోజూ వ్రాసే రామకోటిలో మూడక్షరాలు తప్ప నా పేరే నేను సరిగ్గా వ్రాయలేను. ఇంక కథలేం వ్రాస్తాన్రా నాయనా నేను" అనునయంగా అంది అమ్మ.

"అదేం కుదర్దు. నీకు చేతనయినట్లుగా వ్రాయి. ఇందులో నష్టం ఏం లేదు కదా." అన్నాన్నేను.

"సరే... నేనేదో ఏడుస్తాలే... ఇంతకీ మీ నాన్నచేత కూడా వ్రాయిస్తావా మరి." నాన్నని క్రీగంట చూస్తూ నన్నడిగింది అమ్మ.

"ఎందుకు వ్రాయడు. మీరంతా వ్రాస్తుంటే నాన్న కూడా వ్రాస్తాడు. ఏ నాన్నా..." అన్నాను కొంత చొరవగా.

"ఏమిట్రా నీ ఛాదస్తం. సరే చూద్దాంలే" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు నాన్న.

"అమ్మా, నాన్న కూడా ఒప్పుకున్నారు. ఇక నీకూ తప్పదు. బీ రెడీ... రేపే ముహూర్తం." అన్నాను శ్రీమతి నుద్దేశించి.

"రేపేనా నాన్నా" సంతోషంగా అడిగారు శ్రీనివాస్, లక్ష్మీ.

"అవును. రేపే. రేపు ఉదయం పదిగంటలకల్లా టిఫిన్ సెక్షన్ పూర్తి కాగానే అందరూ ఒకేసారి మొదలుపెట్టండి. ఎవరెవరు ఏఏ విషయం మీద వ్రాయాలో ఈ రాత్రికే ఆలోచించి పెట్టుకోండి."

"అన్యాయం నాన్న. నువ్వు కథ వ్రాయాలని మమ్మల్ని అడిగింది ఇవాళ. రేపే మొదలు పెట్టమంటే ఎలా... నీకంటే ఎప్పటికప్పుడు రకరకాల ఆలోచనలు వస్తుంటాయ్... వ్రాస్తుంటావ్. మమ్మల్ని కూడా అలాగే వ్రాయమంటే ఎలా... పైగా పరీక్షలా అలా అందరం ఒకేసారి ఎందుకు మొదలుపెట్టాలి." అడిగేడు శ్రీనివాస్.

"అవున్రా... మరీ ఇంత ఇరకాటంలో పెడితే ఎలా కనీసం మాకు ఓ పది రోజులన్నా టైం వుండకపోతే ఎలా..." అని నవ్వింది అమ్మ.

"అంతేకాదు కథలు వ్రాసేందుకు ఇతర నియమాలు అంటే ఎన్ని పేజీలకు మించకూడదు, కథ తెలుగువారి జీవితానికి సంబంధించినదై వుండాలా... వగైరాలు ఏమీ చెప్పకుండా ఎట్లా నాన్నా" ఎగతాలిగా అడిగింది లక్ష్మి.

"అవన్నీ ఏం లేవు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు వ్రాయవచ్చు. ఎన్ని పేజీలైనా వ్రాయచ్చు. భాషా దోషాలు పట్టించుకోను. అచ్చు(ల) తప్పులేకాదు, హల్లుల తప్పులున్నా సరిపుచ్చుకుంటాను. కాని ఓ వారంలో అంటే సరిగ్గా వచ్చే శనివారం రాత్రికి అందరూ నాకు మీరు వ్రాసిన కథలు ఇచ్చేయాలి. సరేనా."

అందరూ అంగీకరించటంతో ఆనందంగా ఊపిరి పీల్చుకున్నాను.

"అన్నట్లు మర్చిపోయాను. కాయితానికి ఒకప్రక్కనే వ్రాయాలా, రెండువైపులా వ్రాయచ్చా నాన్నా." అడిగింది కల్యాణి.

"రెండువైపులా వ్రాయండమ్మా... కాగితాల ఖర్చెందుకు" నా బదులు నాన్న సమాధానం చెప్పేడు.

అవునన్నట్లు తలూపేన్నేను.

ఒక్కొక్కరే నిద్రకుపక్రమించటంతో నేనూ నాగదిలోకి వెళ్లాను. అలవాటు ప్రకారం ఓ పుస్తకం చేతపట్టుకుని నడుం వాల్చేను.

శ్రీమతి వంట గది సర్దుకుంటున్నది. పుస్తకం చదువుతున్నానేగానీ ఏకాగ్రత కుదరటంలేదు. అందుకే పుస్తకం మూసి అలా కళ్లు మూసుకుని పడుకున్నాను. ఇంట్లో వాళ్లంతా ఏ ఏ విషయాల మీద కథలల్లుతారో తెలుసుకోవాలని తెగ ఉబలాటంగా ఉన్నది నాకు. నా కోరిక బయటపెట్టి గంట కూడా కాలేదు. వారం రోజులు ఎప్పుడెప్పుడు గడుస్తయ్యా అన్న ఆరాటం మొదలయింది నాలో.

మరో పది నిమిషాల తర్వాత శ్రీమతి రాకతో సాహిత్య పర్వానికి స్వస్తి పలికి శృంగార పర్వానికి సంసిద్ధుడనయ్యాను.

రోజు రోజుకు నాలో సహనం సన్నగిల్లుతున్నది. అందుకు మరో ముఖ్యకారణం మా ఇంట్లో ఎవరూ మళ్లీ కథల గురించిన చర్చ నాతో జరపలేదు. అయినా ఎవరికి వాళ్లు వ్రాస్తునే వున్నట్లు మాత్రం గ్రహించేను. అంతా రహస్యంగా జరిగిపోతున్నది.

ఎవరికి వారు ఏకాంతంగా కథా రచన చేస్తున్నట్లు పసిగట్టేను. నేనూ ఎవర్నీ ఏమీ అడగలేదు. చివరికి శ్రీమతి కూడా నాతో తను వ్రాస్తున్న కథ గురించి మాట్లాడకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

శనివారం ఉదయం ఆఫీసుకు వెళుతూ "సాయంత్రం ఆరుగంటలకల్లా ఇంటికి వస్తాను. నేను రాగానే అందరూ కథలు నా చేతికి ఇచ్చేయాలి. ఎవరన్నా ఇంకా పూర్తి చేయవలసివుంటే సాయంత్రంలోపు రెడీ చేయండి" అని చెప్పేను.

"ఎప్పుడో రెడీ... మీరు వెళ్లిరండి" నవ్వుతూ వూరించింది శ్రీమతి.

"నేను మొన్ననే పూర్తి చేశాను. కానీ ఎవరూ ఇవ్వలేదు కదా అని నేనూ ఇవ్వలేదు." నిజం చెప్పింది కల్యాణి.

"ఇంకా కొంచమే వుంది. సాయంత్రానికి పూర్తి చేస్తాగా" అన్నాడు శ్రీనివాస్.

"నాన్నా నేను రెండు రాశా" రెండు వేళ్లు చూపుతూ మరీ చెప్పేడు వరుణ్.

వాడ్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకు దింపేను. హడావిడిగా ఆఫీసుకు వెళ్లాను.

ఆఫీసులో పనిమీద ఏమాత్రం మనసు నిలవటంలేదు. ఎప్పుడెప్పుడు సాయంత్రం ఆరవుతుందా. ఇంటికి వెళ్లి ఎప్పుడెప్పుడు ఇంట్లో వాళ్ళ కథలు చదువుదామా అనిపించింది.

శ్రీమతి పూరింపు నన్ను మరీ రెచ్చగొట్టింది. గంభీరంగా చెప్పిన శ్రీనివాస్ సమాధానం నాకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది.

'అయిదు దశాబ్దాల వైవాహిక జీవితం గడిపిన అమ్మ ఏం కథ వ్రాసిందో.'

'ఏడు పదులు నిండిన నాన్న ఏ విషయాన్ని కథా వస్తువుగా తీసుకున్నాడో!'

'డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ, ఫైటింగ్ సినిమాలను, క్రైం సీరియల్స్‌ని ఇష్టపడే శ్రీనివాస్ ఏ కథ వ్రాశాడో!'

'మనసులో ఏముందో ఓ పట్టాన బయటపెట్టకుండా గుంభనంగా వుండే లక్ష్మి ఎలాంటి కథ వ్రాసిందో!'

'ప్రతిదాంట్లోనూ ముందుంటూ, ఏమాత్రం ఆలోచించకుండా ఆవేశంగా మాట్లాడేసి నాలుక్కరుచుకునే కల్యాణి కథ ఎలా వుంటుందో!'

'రెండు కథలు వ్రాశానన్న వరణ్ ఏం వ్రాశాడో అ, ఆలతో కాయితం నింపుంటాడా!'

'ఇరుగు పొరుగువారి విషయాల్ని కథలు కథలుగా చెప్పే శ్రీమతి ఏం కథ వ్రాసుంటుంది?'

ఆరాటాన్ని అణచుకోలేకపోయాన్నేను.

అయిదు గంటలు కావడంతోనే ఆఫీసు నుండి బయటపడ్డాను.

అమ్మ దగ్గర్నుంచి, ఆరేళ్ళ వరుణ్ వరకూ అందరి కథల మీద ఆసక్తి సమానంగా వుంది నాకు. ఆరు గంటలలోపే ఇంటికి చేరాలన్న తాపత్రయం కారణంగా వడివడిగా అడుగులేస్తూ బస్టాప్‌వైపు నడక సాగించేను.

నేను ఇంటికి చేరేసరికి అందరూ హాల్లో కూర్చుని వున్నారు. నన్ను చూడగానే అందరి ముఖాల్లోనూ అదోరకం ఉద్విగ్నత. నవ్వుతూ అందరివంకా చూశాను.

శ్రీమతి టిఫిన్ ప్లేటు, మంచినీళ్ల గ్లాసుతో ప్రత్యక్ష్యమయింది. అందరికంటే ముందు వరుణ్ వాడి కథ నా చేతికందించాడు.

"వెరీగుడ్... ఇలా వుండాలి... మీ అందరివీ కూడా ఇచ్చేయండి త్వరగా. టిఫిన్ కాఫీ పూర్తి చేసి ఒక్కొక్కటి చదివేసి బహుమతి ప్రకటించేస్తాను" అన్నాను.

"ముందు టిఫిన్ తినండి" శ్రీమతి ప్రోద్బలం.

"ముందు మీరు వ్రాసిన కథలన్నీ నా చేతి కివ్వండి. అప్పుడుగాని టిఫిన్ తినటం ప్రారంభించను. అసలు నేనీరోజు ఎంత ఆరాటంగా వచ్చానో తెల్సా."

"ఇవిగోండి. ఈ ఫైల్లో మా ఆరుగురి కథలూ వున్నాయ్. వరుణ్ ముందే ఇచ్చేశాడు కదా. ఇక టిఫిన్ పూర్తి కానివ్వండి... తర్వాత మీకూ మేం ఓ పరీక్ష పెడతాం." కొంటెగా అన్నది శ్రీమతి.

టిఫిన్ తింటున్నానేగానీ వీళ్లంతా కలిసి నాకు పెట్టబోయే పరీక్షేమిటో అర్థం కాలేదు నాకు. ఆలోచిస్తూనే గబగబా టిఫిన్ తినేసి కాఫీ కప్పు ఖాళీ చేశాను.

సరిగ్గా అప్పుడే పక్కింటి ప్రభావతి వచ్చింది. నేను మౌనంగా ఆ కవర్లోంచి కాయితాలు బయటకు తీయబోయాను.

"ఆగండాగండి. ముందుగా మీకో విషయం చెప్పాలి. ఆ ఆరు కథలు మేం ప్రభావతి అక్కచేత వ్రాయించాం. వాటి పైన కథల పేర్లు వున్నయేకాని మా పేర్లు వ్రాయలేదు. కథలన్నీ చదివి వాటిల్లో ఏ కథ ఎవరం వ్రాశామో మీరు చెప్పాలి." నవ్వుతూ చెప్పింది కల్యాణి.

అదో పెద్ద పరీక్షకాదులెమ్మనుకున్నాను మనసులోనే.

"కథలన్నీ చదివాక చెప్పేస్తాను... సరేనా." అన్నాను అందర్నీ ఉద్దేశించి.

అంగీకరించారందరూ.

ఓ కథ చేతిలోకి తీసుకుని చదవనారంభించాను. ప్రభావతి దస్తూరి ముచ్చటగా వుంటుంది. ముత్యాల్లాంటి అక్షరాలు. ఇదివరలో ఒకటి రెండు నా కథలు కూడా ఫెయిర్ కాపీ వ్రాసిపెట్టిందా అమ్మాయ్.

అయిదు నిమిషాల్లో ఆ కథ చదవటం పూర్తయింది. అదో భగ్న ప్రేమికుల కథ. కథ పేరు "వరలక్ష్మి ప్రేమ."

'రెండో కథ చదివేశాను. చాలా చిన్నకథ. లంచాల గురించిన ఇతివృత్తం. కథ పేరు 'సుడిగుండం'. మూడో కథ పేరు 'మమకారం' పిల్లలపై తల్లిదండ్రుల మమకారాన్ని గురించిన విషయం. కథ నడిపిన తీరు నచ్చింది నాకు.

నాలుగో కథ నిరుద్యోగం గురించి. కథ పేరు 'ఆక్రందన.'

అయిదో కథ వరకట్నాల గురించి 'పెళ్లి'. 'పనిమనిషి' అనేది ఆరోకథ.

నేను కనుక్కోవలసింది ఈ ఆరు కథల్లోనే అందరికీ తెలిసిన వరుణ్ కథ తీసి చూశాను. ఆ కథలో అక్షరాలు, అంకెలు, బొమ్మలు కూడా వుండటంతో అందరం నవ్వుకున్నాం. వాడు అలిగేడు. కాసేపు వాడికి మాయ మాటలు చెప్పి, వాడ్ని, వాడి కథను మెచ్చుకుని వాడ్ని ప్రసన్నం చేసుకున్నాక మిగిలిన కథ నడిచింది.

"ఇప్పుడు వరసగా చెప్పండి. ఏ కథ ఎవరు వ్రాసిందో." అడిగింది లక్ష్మి.

నేనెంత వరకు కరెక్ట్‌గా చెప్పగలుగుతానో అని ఆసక్తిగా వున్నారందరూ.

"నేనొక్క పది నిమిషాలలో బయటకు వెళ్లి వచ్చి చెప్తా" అంటూ కుర్చీలోంచి లేచాను.

"అక్కా నువ్వు ఇక్కడే వుండు" అంటూ ప్రభావతిని పట్టుకుంది కల్యాణి.

వరండాలోకి నడిచి ఓ సిగిరెట్ వెలిగించుకుని కథల గురించి ఆలోచనలో పడ్డాను. చాలా ఆలోచించుకుని కథల పేర్లు, ఇతివృత్తాలు, పాత్రల పేర్లు, కథ నడిపిన తీరు అన్నీ ఓసారి స్ఫురణకు తెచ్చుకుని నా నిర్ణయం సరైనదేనన్న నమ్మకం కలిగాక ఇంట్లోకి నడిచేను.

'మమకారం' అమ్మ కథ. 'సుడిగుండం' నాన్న కథ. 'ఆక్రందన' శ్రీనివాస్ వ్రాసింది. 'పెళ్లి' లక్ష్మి వ్రాసిన కథ. 'పనిమనిషి' శ్రీమతి విరచితం. 'వరలక్ష్మి ప్రేమ' కల్యాణి వ్రాసింది. 'వేనదొంగ' వరుణ్ కథ. గడగడ చెప్పేశాన్నేను.

నవ్వుతూ నాన్న చప్పట్లు కొట్టడంతో నాలో అనుమానం చోటు చేసుకుంది.

"ఓడిపోయారు. మీరోడిపోయారు." అంటూ పిల్లలూ, శ్రీమతి ఆటపట్టించారు నన్ను.

అయోమయంగా అందరి వంకా చూశాను.

"ఒరేయ్.... నువ్విలా చెప్తావని నేను ముందుగానే వూహించాను. కావాలంటే ఇదిగో నా చేతిలో ఇందాకట్నుంచీ నలుగుతున్న కాయితం చూడు" అంటూ వుండగా చేయబడిన కాయితం నాకందించాడు నాన్న. దాన్ని విప్పి చూశాను. నా అంచనాలన్నీ తప్పయినట్లు గ్రహించాను.

అయోమయంగా అందరివంకా చూశాను. అందరూ నవ్వూ ముఖాల్తో నన్ను ఉడికిస్తూ నిల్చున్నారు.

"నేను చెప్పినదాంట్లో ఒక్కటి కూడా కరెక్ట్ కాదా." ఆశ్చర్యంగా అడిగేన్నేను.

"కాదన్నారు" ఏక కంఠంతో.

నమ్మశక్యం కాలేదు నాకు.

"ఓడిపోయానని బాధపడకురా. అయినా ఇందులో గెలుపూ, ఓటమి ఏమిటి. అయితే ఒక్క విషయం గుర్తుపెట్టుకో." అంటూ నాకళ్లల్లోకి చూశారాయన.

ఏమిటా అన్నట్లు ఆసక్తిగా ఆయన వంక చూడసాగేను.

"ఇప్పటికైనా ఒప్పుకుంటావా స్త్రీవాద కథలంటే ఆడవారే వ్రాయాలని, దళిత కథలంటే దళితులే వ్రాయాలని అనడం సబబుకాదని."

"రచన ఓ కళ. వస్తువు అనుభవంలోదే కానక్కర్లేదు. అనుభూతి ముఖ్యం. సాహిత్యం అంతా ఒక్కటే, మహాసముద్రం. దాన్ని చీల్చి చండాడి, అది మాది, ఇది మీది అని పంచుకునే స్థాయికి చేరటం మంచిది కాదేమో ఆలోచించండి." అంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయారాయాన.

'అవును కదా' అన్న ఆలోచనలో పడ్డాన్నేను. ఓటమి నుండి తేరుకుని మొదటి బహుమతిని వరుణ్‌కు ఇచ్చి మిగిలిన వారందరికీ నేను తెచ్చిన స్వీట్లు స్వయంగా తినిపించి తృప్తిపడ్డాను.

◆ ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక – డిసెంబర్, 1997 ◆